# సాక్షి శ్రీకాకుళం





## వామ్మో.. వానర సైన్యం

టెక్కలి ప్రాంత వాసుల్ని కోతులు బెంబేలెత్తిస్తున్నాయి. పంటలు నాశనం చేస్తున్నాయి.

- 8లో



## దూసుకొచ్చిన మృత్యువు

ఎచ్చెర్ల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ వ్యక్తి మృతి చెందారు.

- 8లో



## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహార్ |
|---|---|
| సోమ (సా) | మంగళ (ఉ) |
| 6.10 | 4.40 |

## న్యూస్‌రీల్


### ఉల్లాసంగా రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు




రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉల్లాసంగా జిల్లా జట్లు ఎంపికలు నిర్వహించారు. కర్నూల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి.పార్వతీశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఎంపికల్లో ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడు డి.రామకృష్ణ క్రీడాకారులకు అవసరమైన దుస్తులు, రవాణా చార్జీలను అందజేశారు. ఈ ఎంపికల్లో ఎస్.జనార్దన్, కేకే రామిరెడ్డి, రాజా, కె.రఘునాథరావు, సత్యనారాయణ, శ్యామలరావు, మోతీలాల్, నారి, సీతయ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

### 'ఉల్లాస్' అపహాస్యం



అవలింగి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పరీక్ష పత్రాలు నింపుతున్న చిన్నారులు

సారవకోట: వయోజనులకు విద్య నేర్పించి వారికి స్వయం శక్తి సంఘాలలో జరుగుతున్న కార్యకలాపాలపై అవగాహన పెంచేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఒక వలంటీర్‌ను నియమించి వారి ద్వారా గ్రామాలలో వయోజనులకు విద్య నేర్పించాలి. ఇదంతా స్థానిక సీఎఫ్ ఆధ్వర్యంలో జరిగాలి. ఆదివారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పరీక్ష నిర్వహించారు. అయితే మండలంలో ఈ పరీక్ష నిర్వహణ అపహాస్యమైంది. లక్ష్మీపురం, బుడితి, చీడిపూడి గ్రామాల్లో పరీక్షలు చేపట్టినట్లు చూపించారే తప్ప పరీక్షలు జరిగిన దాఖలాలు కనిపించలేదు. అవలింగిలో స్థానిక సీఎఫ్ కోట సంతోషి ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నారులతో పరీక్ష పత్రాలను నింపించేశారు. లక్ష్మీపురంలో పరీక్ష కోసం సీఎఫ్ సుశీలను విచారించగా గ్రామంలో ఫంక్షన్ జరుగుతోందని పరీక్ష ఉదయం నిర్వహించామని చెప్పారు.

### ముగిసిన నాటిక పోటీలు



అప్పారావు హాస్యవల్లరి ప్రదర్శన


శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన హనుమంతు చిన్నరాములు స్మారక జాతీయ స్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ సినీ, టీవీ హాస్యనటులు అప్పారావు ప్రదర్శించిన 'హాస్యవల్లరి' అందరినీ నవ్వించింది. అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి వారి ఆధ్వర్యంలో 'విడాకులు కావాలి' నాటిక ఆకట్టుకుంది. వల్లూరి శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వంలో చక్కనైన ప్రదర్శన చేశారు. విశాఖకు చెందిన చైతన్య కళా స్రవంతి వారిచే 'అసత్యం' నాటిక కూడా అలరించింది. అనంతరం హాస్యనటుడు అప్పారావును సుమిత్రా కళాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, లోకనాథం రామలింగేశ్వరరావు, నక్క శంకరరావు, మండవిల్లి రవి, కిల్లా ఫల్గుణరావు, మూర్తి, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ ప్రదర్శనగా 'స్వప్నం రాల్చిన అమృతం'**

సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో.. ఉత్తమ ప్రదర్శన బహుమతి కరీంనగర్, చైతన్య కళాభారతి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికకు దక్కింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, విశాఖ, చైతన్య కళాస్రవంతి వారి 'అసత్యం' నాటికకు, ఉత్తమ జ్యూరీ ప్రదర్శన తాడేపల్లి, అరవింద్ ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి'నాటికకు దక్కాయి. న్యాయనిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, గెద్దా వరప్రసాద్, లండ రుద్రమూర్తిలు వ్యవహరించారు. విజేతలకు ప్రముఖ టీవీ, సినీ హాస్యనటులు అప్పారావు చేతుల మీదుగా బహుమతులను అందించారు.

# విధుల ఒత్తిడి ▶ వ్యాధుల ముట్టడి

## తీవ్ర పనిభారంతో ఒత్తిడికి లోనవుతున్న జిల్లా పోలీసులు



పండగ జరుగుతోంది...
ఖాకీలు కావాలి.
గొడవలు అవుతున్నాయి..
పోలీసులు రావాలి.
అమాత్యులు పర్యటిస్తున్నారు..
దారుల్లో గస్తీ కాయాలి.
అక్కడెక్కడో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి..
ఆ మనుషులే నీళ్లు పోయాలి.
అర్ధరాత్రి ఏదో అలజడి..
నిద్ర మానుకుని హాజరు కావాలి.
విరామం లేని విధులతో, కునుకు పడని కక్షతో పోలీసులు అలసిపోతున్నారు.
ఊపిరి సలపనివ్వని ఒత్తిళ్లతో వారి గుండెలు అవిసిపోతున్నాయి.

- గుండె సంబంధిత వ్యాధులు, బీపీ, మధుమేహం బారిన పోలీసులు
- ఇటీవల జెమ్స్ వైద్య పరీక్షల్లో వందమందికి పైగా స్టంట్లు అవసరమన్న వైద్యులు
- 50 ఏళ్లు దాటిన హెచ్‌సీలు, ఏఎస్‌ఐలు, ఎస్‌ఐ–2లపై పెనుభారం



అరసవల్లి బందోబస్తు డ్యూటీలో పోలీసు సిబ్బంది (ఫైల్)



వీల్‌చైర్ తోస్తున్న మహిళా ఏఎస్‌ఐ

శ్రీకాకుళం క్రైమ్ :

ఓ వైపు శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి.. మరోవైపు ఆకతాయిలు పెచ్చు మీరుతున్నారు. ఇంకోవైపు గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు పెరుగుతున్నాయి. అన్నింటికీ పోలీసులే కావాలి. కానీ సరిపోయేంత సంఖ్యలో ఖాకీలు జిల్లాలో లేరు. ఫలితంగా ఉన్న వారిపైనే ఒత్తిడి పడుతోంది. ఊపిరి సలపనంత పనితో వారి గుండెపై భారం పడుతోంది. తీవ్ర నిద్రలేమి, సరైన సమయానికి భోజనం లేక 30 ఏళ్లు దాటిన పోలీసులకు సైతం బీపీ, మధుమేహం వస్తున్నాయి. చాలా మందికి ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు కూడా దెబ్బతింటున్నాయి. 50 ఏళ్లు దాటిన వారితో పాటు 35 ఏళ్లలోపు వారు పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. ఉన్నతాధికారులకు చెప్పుకోలేక, కుటుంబ సభ్యులతో ఈ కష్టం పంచుకోలేక చాలా మంది తమలో తామే కుమిలిపోతున్నారు.

> జిల్లా కేంద్రం సమీపంలోని జెమ్స్‌లో ఇటీవల పోలీసులకు నిర్వహించిన మెడికల్ క్యాంపులో **103**మందికి పైగా సిబ్బందికి గుండెకు సంబంధించిన యాంజియోగ్రామ్, స్టంట్స్ అవసరమని వైద్యులు నిర్ధారించారంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.


**సిబ్బంది.. ఇబ్బంది**

జిల్లాలో 38 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. రెండు వేల మంది పోలీసులు ఉన్నారు. ఉన్నవాళ్లలో 20 శాతం మందిని దేవాలయాలు, రాజకీయ సమావేశాలు, పోలీస్ పికెటింగ్, విద్యార్థుల పరీక్షలు వంటి బందోబస్తు కార్యక్రమాలకు పంపుతుంటారు. ఒక్కో స్టేషన్‌లో 50 నుంచి 70 మంది ఉండాల్సి ఉన్నా పట్టుమని 20 మందైనా ఉండడం లేదు. ఈలోగా స్టేషన్లలో పెండెన్సీ కేసులు, కొత్త కేసులు, కొత్త చట్టాలు, కొత్త యాప్‌లు, సంకల్పాలు, అవగాహనలు ఒకదాని మీద ఒకటి వచ్చి పడుతూనే ఉంటాయి. ముఖ్యంగా హోంగార్డులు, కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల కొరత వేధిస్తోంది. మరో 500 మంది సిబ్బంది ఉంటే తప్ప ఉన్న వారి ఆరోగ్యం బాగు పడేట్లు కనిపించడం లేదు.

**సొంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ..**

50 ఏళ్లు దాటిన వారిని సైతం సుదూర (విజయవాడ)బందోబస్తులకు పంపిస్తుండటం ఇబ్బందిగా ఉంటుంది. టీఏ, డీఏలు, సరెండర్‌లీవ్‌లు కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పదిమంది వెళ్లాల్సిన స్థానంలో వందమందినైనా అక్కడి వాళ్లు అడుగుతుండటం, సొంత డబ్బులతోనే సిబ్బంది వెళ్తుండటం జీతాలు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. స్టేషన్లలో పోలీసు వాహనాల కొరత ఉండటంతో సొంత వాహనాలకు పెట్రోల్ పోసి పరిసర ప్రాంతాల విధుల్లో తిరగాల్సి వస్తోందని చాలామంది వాపోతున్నారు.

### వీరి పరిస్థితే హెచ్చరిక..



- జనవరిలో నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో యువకుడైన నాగరాజు అనే హోంగార్డు గుండెపోటుతో మరణించాడు. ఆయనకు భార్య, చిన్న పిల్లలున్నారు.
- జిల్లా కలెక్టరేట్ ట్రెజరీ విభాగంలో చెస్ట్ గార్డుగా ఉన్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సవర జోక్యో గుండెపోటుతో మరణించాడని పోలీసులు ధ్రువీకరించారు. ఆయన వరుసగా మూడురోజులు విధుల్లో ఉన్నారు.
- మందస హెడ్‌కానిస్టేబుల్ గవరయ్య (59) గుండెపోటుతోనే మరణించారు.
- నగరంలోనే కిడ్నీలు ఫెయిల్ అయి ఓ కానిస్టేబుల్ మృతిచెందాడు.
- సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకార బందోబస్తు విధులకు వెళ్లిన 57 ఏళ్ల ఆబోతుల లక్ష్మయ్య ఎండల వేడిమి తట్టుకోలేక స్ట్రోక్ వచ్చి విజయవాడలోనే మృతిచెందాడు. ఈయనది పోలాకి మండలం పల్లిపేట.
- సోంపేట ఎస్‌ఐ రవివర్మకు ఇటీవలే రెండోసారి స్ట్రోక్ వచ్చింది. తొలిసారి ఒక స్టంట్, ఇప్పుడు యాంజియోగ్రామ్ అవసరమన్నారు. ప్రస్తుతానికి లీవ్‌లో ఉన్నారు.
- కాశీబుగ్గ కానిస్టేబుల్‌కు హార్ట్ ప్రాబ్లెం ఉండటంతో స్టంట్ వేయించుకున్నారు. సోంపేటలో ఓ కానిస్టేబుల్‌కు ఇదే పరిస్థితి ఉంది.

### డే బై డే నైట్ డ్యూటీలతో సిక్..



నైట్‌బీట్ విధుల్లో ఏఎస్‌ఐ..

గతంలో నైట్ బీట్ డ్యూటీల్లో కానిస్టేబుళ్లు, హోంగార్డులే ఉండేవారు. ఎస్‌ఐలు, సీఐలు రౌండ్లకు వెళ్లేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. 50 ఏళ్లు నిండి రిటైర్మెంటుకు దగ్గరలో ఉన్న ఏఎస్‌ఐలు నుంచి హెడ్‌కానిస్టేబుళ్లు కూడా డే బై డే నైట్ బీట్లకు వెళ్లాల్సి వస్తోంది. అవసరాన్ని బట్టి కొన్ని చోట్ల ఎస్‌ఐ–2లు వెళ్తున్నారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఐదు వరకు ఉండటమే కాక గంట గంటకూ లైవ్ లొకేషన్, రెండు ఫొటోలు పంపాల్సిందే. మళ్లీ ఉదయాన్నే రోల్‌కాల్ 8గంటలతో డ్యూటీ మొదలు. 7:45 కల్లా సిద్ధంగా ఉండాలి. సెట్‌కాన్ఫరెన్సు (ఎస్‌ఐ, ఆపై ర్యాంకు) అయితే 7:30 నుంచి 9 గంటల వరకు ఉంటుంది. మళ్లీ సాయంత్రం 5కి రోల్ కాల్, 7:30 నుంచి సెట్ కాన్ఫరెన్సు.. కొన్నిమార్లు జూమ్ కాన్ఫరెన్సులు.. సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ ఉంటాయి.



**జిల్లాలో సిబ్బంది గణాంకాలు (సుమారు)**

లాఅండ్‌ఆర్డర్ ఏఎస్‌ఐలు 100, ఎస్‌ఐలు 70 ఏఆర్ విభాగానికి చెందిన ఏఎస్‌ఐలు 25, కానిస్టేబుళ్లు 364 మంది ఉన్నారు.

| | డీఎస్పీలు | సీఐలు | పీసీలు | హెచ్‌సీలు | ఏఆర్‌సీఐలు | ఏఆర్‌ఎస్‌ఐలు | హోంగార్డులు |
|---|---|---|---|---|---|---|---|
| ఉన్నవాళ్లు | 04 | 20 | 645 | 248 | 01 | 06 | 600 |
| ఉండాల్సింది | 08 | 25 | 750 | 270 | 03 | 08 | 705 |

## 'కుప్పిలి'పై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: మాస్ కాపీయింగ్‌తో అందరి దృష్టిలో పడిన కుప్పిలి టెన్త్ పరీక్ష కేంద్రంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. టెన్త్ గణితం పరీక్ష సోమవారం జరగనుంది. తర్వాత సైన్స్, సోషల్ పరీక్షలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కుప్పిలి మోడల్ స్కూల్‌లోని ఏ, బీ పరీక్ష కేంద్రాల్లో 425 మంది పరీక్ష రాస్తున్నారు. 17 గదుల్లో పరీక్షలు జరుగుతున్నాయి. 21 మంది విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం పాత వారిని అందరినీ మార్చాలని నిర్ణయించుకున్నారు. ఇన్విజిలేటర్లు, కస్టోడియన్ కంసిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లు ఇలా అందరినీ మార్పు చేస్తున్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి తిరుమల చైతన్య ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

## కొత్తూరులో చిరు జల్లులు



కొత్తూరులో కురిసిన వర్షం

కొత్తూరు: కొత్తూరులో ఆదివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. సుమారు నాలుగు నెలల నుంచి వర్షాలు లేవు. గత రెండు రోజుల నుంచి వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో మండలంలోని కర్లెమ్మ, పారాపురం, ఎస్‌ఎన్ కాలనీలతో పాటు పలు గ్రామాలలో వర్షం కురిసింది. వర్షం జీడి, మామిడి, నువ్వుతో పాటు కూరగాయ పంటలకు ఎంతో ఉపయోగపడింది.

## భగత్‌సింగ్‌కు నివాళి



పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

కవిటి: భారత స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని హెచ్‌ఎం బెజ్జిపల్లి దేవదాస్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 94వ జయంతి సందర్భంగా పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి భగత్‌సింగ్ వేషధారణతో అలరించాడు.

## జయహో రాజమ్మ తల్లి



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



వత్సవలస సమీప సముద్ర తీరంలో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ సిబ్బంది

గార: చినవత్సవలస గ్రామంలోని రాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) సంబరాలకు భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది ఏడో వారం ఉత్తరాంధ్ర కాకుండా రెండు ఉభయ రాష్ట్రాల నుంచి శనివారం సాయంత్రానికి కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు గ్రామ పరిసరాలకు చేరుకున్నారు. రాత్రి జాగరణ చేసి ఉదయం సమీప సముద్రంలో పవిత్ర స్నానాలాచరించారు. అనంతరం గ్రామంలోని రాజమ్మ తల్లి, భూలోకమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోనే వంటా వార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. సముద్ర తీరంలో ఎస్‌ఐ హరికృష్ణ, మహాలక్ష్మి ఆధ్వర్యంలో మెరైన్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గార ఎస్‌ఐ ఆర్.జనార్దన్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

## మధ్యాహ్న భోజనాలపై ఆరా

మెళియాపుట్టి: 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన 'స్కూల్‌లో చాలని మధ్యాహ్న భోజనాలు' అనే కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య స్పందించారు. భోజనాలు ఎందుకు సరిపోలేదో తెలుసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో.. మెళియాపుట్టి ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు ఆదివారం సెలవైనా టీచర్లను పిలిపించి దీనిపై వివరణ తీసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు హోటల్ మీల్స్ ఇవ్వడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారని, ఉపాధ్యాయులు తీరు మార్చుకోవాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్ ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించడం వల్లే ఇలా జరిగిందని ఎంఈఓలతో ఉపాధ్యాయులు తెలిపారు. టెన్త్ పరీక్షల వల్ల పిల్లలు మధ్యాహ్నం పూట బడికి వస్తుండడంతో అంచనాలు వేయలేక భోజనాలు సరిపోలేదని టీచర్లు చెప్పినట్లు ఎంఈఓ తెలిపారు. పూర్తి నివేదికను జిల్లా విద్యాశాఖ అధకారికి అందిస్తామన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు



వైఎస్సార్ సీపీ కార్యకర్త భీమారావుపై దాడి చేస్తున్న టీడీపీ సానుభూతిపరులు

ఇచ్ఛాపురం రూరల్: 'ఏరా.... ఏ ఊరు నీది...?. మీ నాన్న ఎవడ్రా...?!' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో వెటకారంగా మాట్లాడి యువకుడ్ని ఒంటర్ని చేసి ముకుమ్మడిగా పిడుగుద్దులు గుద్ది పైశాచికానందం పొందారు టీడీపీ సానుభూతిపరులు. వివరాలలోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం మశాఖపురం గ్రామంలో కొత్తపల్లి దేవరాజుది ఒకే ఒక్క విశ్వబ్రాహ్మణ కుటుంబం. దేవరాజు కుమారుడు భీమారావు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా ఉంటాడు. భీమారావు అదే గ్రామంలో ఆదివారం జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. అదే గ్రామానికి చెందిన పైల బైరాగి, రంగు కామేష్ అనే టీడీపీ సానుభూతిపరులు భీమారావును పిలిచి 'మీది ఈ ఊరు కాదు కదా.. మరి ఏ ఊరు, మీ నాన్న ఎవడ్రా...?' అంటూ వెటకారంగా మాట్లాడటంతో భీమారావు ప్రతిఘటించాడు. దీంతో పైల బైరాగి, రంగు కామేష్‌లతో పాటు ఉప సర్పంచ్ ఆశి మాధవరావు, ఆశి లక్ష్మీనారాయణ, రోకళ్ల కుమార్‌లు భీమారావును చుట్టిముట్టి పిడుగుద్దులతో దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న మహిళలు అడ్డుకున్నారు. భీమారావు స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో తనకు ప్రాణహాని ఉందంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై సీఐ ఎం.చిన్నంనాయుడు మాట్లాడుతూ ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాలను విచారణ చేస్తున్నామని తెలిపారు.



శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కూన కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ సీపీ కార్యకర్త, పూర్వపు వలంటీర్ కూన కిరణ్‌కుమార్‌పై టీడీపీ వర్గానికి చెందిన వారు ఆదివారం దాడికి పాల్పడ్డారు. కిరణ్‌కుమార్ బైక్‌పై ఫరీదుపేట వస్తుండగా ముగ్గురు వ్యక్తులు దారి కాచి కర్రలు, రాడ్డుతో దాడి చేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి విషయాన్ని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లగా గ్రామానికి డీఎస్పీ వివేకనంద, ఎస్‌ఐ సందీప్‌కుమార్ చేరుకున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఇప్పటికే కొనసాగుతోంది. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పాలిథీన్ కుసుమాలు

పంటలను కాపాడుకునేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు వర్ణనాతీతం. టెక్కలి మండలం గంగాధరపేట సమీపంలో ఓ రైతు తన పొద్దు తిరుగుడు పంటను కాపాడుకునేందుకు ఇలా ప్రతి పువ్వుకు నీలి రంగు పాలిథిన్ కవర్‌ను అమర్చాడు. పక్షులు తినకుండా ఇలా రక్షణ చర్యలు చేపట్టాడు. – టెక్కలి



## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించినట్లు శ్రీకాకుళం స్టేషన్ సీఐ ఎం.వి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటర్న్ అధికారిగా తనతో పాటు నరసన్నపేట సీఐ ఎస్.వి.రమణ మూర్తి వ్యవహరించినట్లు తెలిపారు. అధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

### ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ప్రత్యేక ఆదివారంతో పాటు వత్సవలస రాజమ్మతల్లి ఉత్సవాల కొనసాగింపు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కొందరు సూర్యనమస్కారాల పూజలు చేయించుకోగా...మరి కొందరు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లుతో పెద్దగా ఉపశమనం కలుగకపోవడంతో భక్తులు విమర్శలకు దిగారు. వీఐపీల పేరిట చాలా మంది ఫేక్ వీఐపీలు దర్శనాలకు వెళ్లడంపై క్యూలైన్లలో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3,76,300, విరాళాల రూపంలో రూ.1,41,803, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.75 లక్షల వరకు ఆదాయం లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ వెల్లడించారు.

### సీఆర్‌పీఎఫ్ జిల్లా సలహాదారుడిగా చందనరావు



శ్రీకాకుళం న్యూకాలనీ: బాలల హక్కుల వేదిక పరిరక్షణ వేదిక(సీఆర్‌పీఎఫ్) జిల్లా సలహాదారుడిగా తమ్మినేని చందనరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి నియామక పత్రం అందజేశారు. చందనరావు సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి జిల్లా కమిటీ చొరవతో చిత్తశుద్ధితో సేవలు అందిస్తానని తమ్మినేని పేర్కొన్నారు. ఈయన నియామకం పట్ల సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జి డి.ప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ అరుణ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస గేటు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీకాకుళం రూరల్ మండలం నైర పంచాయతీ చల్లపేటకు చెందిన కరిమెళ్ల సూరిబాబు(55) ఆమదాలవలస గేటు ప్రాంతంలో వడ్రంగి దుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబం లేకపోవడంతో అక్కడే ఉంటున్నాడు. ట్రాక్ దాటేందుకు వచ్చాడో, ఇంకేం జరిగిందో తెలియదు గానీ ఆదివారం పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు శవ పంచనామా కోసం తరలించారు.

### రైలు ఢీకొని యువకుడు మృతి

పొందూరు: పొందూరు రైల్వేగేటు సమీపంలో ఆదివారం అమరావతి రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతిచెందినట్లు ఆమదాలవలస జీఆర్‌పీ ఎస్ఐ ఎం.మధుసూదనరావు తెలిపారు. సుమారు 30 ఏళ్ల గల ఈ యువకుడు పట్టాలు దాటుతుండగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. యువకుడు ఎరుపు టీషర్టు, నీలం ప్యాంట్ ధరించాడని, ముఖం గుర్తు పట్టలేని విధంగా మారిందని చెప్పారు. వివరాల కోసం 9493474582 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### శ్రీకూర్మంలో భక్తజన సందోహం



కూర్మనాథాలయం క్యూలైన్‌లో భక్తులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణ భక్తులతో పాటు చిన వత్సవలస రాజమ్మ తల్లి సంబరాల నుంచి తిరుగుపయనమైన వారు కూడా క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథం పర్యవేక్షించారు. మరోవైపు సరైన పార్కింగ్ స్థలం లేక వాహనదారులకు ఎప్పటి లాగే ఈ వారం కూడా ఇబ్బందులు తప్పలేదు. కారు, ఆటో, బైక్‌లు పెట్టేందుకు స్థలం చూపించకపోయినా ఆశీలు మాత్రం పంచాయతీ పేరిట వసూలు చేస్తుండటంపై పలువురు వాహనచోదకులు అసహనం వ్యక్తం చేశారు.

# వామ్మో.. వానర సైన్యం!



కోతుల కోసం గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న బోను




వానరాలతో నష్టానికి గురవుతున్న మామిడి తోటలు



గూడేం గ్రామంలో ఇళ్లపై సంచరిస్తున్న వానరాలు

- బెంబేలెత్తిపోతున్న గూడేం గ్రామస్తులు
- గుంపులుగా తిరుగుతున్న కోతులు
- మామిడి, మునగ, మొక్కజొన్న పంటలు నాశనం

టెక్కలి : గూడేం.. టెక్కలి మండలంలోని ఈ గ్రామం పేరు వినగానే మొదటగా గుర్తుకు వచ్చేది కార్గిల్ పోరాట యోధులే. పలువురు సైనికులు అప్పటి యుద్ధంలో పాల్గొని గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. ఇదే గ్రామం మామిడి పంటకు సైతం ప్రసిద్ధి. ఇక్కడి మామిడిపండ్లకు ఇతర రాష్ట్రాల్లో ఎంతో గిరాకీ. అటువంటి గూడేం గ్రామస్తులకు ఇప్పుడు వానరాల గుంపు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు గానీ గుంపులుగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. మామిడి పంటలు, మునగ, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి అకస్మాత్తుగా దాడులకు తెగబడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉండటంతో గ్రామస్తులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. ఏటా మామిడి పంటతో లాభాలను చవి చూస్తున్న తమకు ఈ ఏడాది ఈ కోతుల బెడద వల్ల ఇప్పటికే తీవ్రమైన నష్టం వాటిల్లిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖాధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.



కోతుల బెడదతో బిక్కుబిక్కుమంటున్న గూడేం గ్రామం ఇదే



ఇళ్లపై ముళ్ల కంపలు వేస్తున్న గ్రామస్తుడు

### ఇళ్లల్లో చొరబడి దాడి..



మా ఊరిలో ఎప్పుడూ ఇటువంటి కోతుల ఇబ్బంది ఉండేది కాదు. ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదు. గుంపులుగా తిరుగుతూ ఇళ్లల్లో చొరబడి దాడులు చేస్తున్నాయి. కొంతమందిపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లపై ముళ్ల కంపలు వేసుకోవాల్సి వస్తోంది.

– జి.అమ్మాయమ్మ, గూడేం, టెక్కలి మండలం

### కాపలా కాస్తున్నాను...



మా ఊరిలో కోతులు తిరుగుతూ మామిడితో పాటు మిగిలిన పంటలపై దాడులు చేస్తున్నాయి. మా గ్రామానికి చెందిన రైతు వేసిన మొక్కజొన్న పంటకు కోతులతో ఇబ్బందులు లేకుండా కాపలా కాస్తున్నాను.

– డి.భాస్కరరావు, గూడేం, టెక్కలి మండలం

### ఆశలు ఆవిరి..



కోతుల బెడద వల్ల ఈఏడాది మామిడి పంటపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే పూత కనిపించక ఆందోళన చెందుతుంటే ఇప్పుడీ కోతుల బెడద. అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.

– టి.పీతాంబరం, మామిడి రైతు, గూడేం, టెక్కలి మండలం.

### కూటమి పాలనలో అన్నీ ఇబ్బందులే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ విమర్శించారు. పాతపట్నంలోని రెడ్డి అపార్ట్‌మెంట్‌లోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓట్లు కోసం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ అన్ని వర్గాలనూ కూటమి నాయకులు మోసం చేశారన్నారు. వెరిఫికేషన్ పేరుతో గత 20 ఏళ్లుగా ఉన్న పింఛన్లను తొలగిస్తున్నారని, దివ్యాంగులను ఎండల్లో తిప్పి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన పది నెలల్లోనే ప్రజలను నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, వాటికి భయపడేది లేదన్నారు. ప్రజల సమస్యలపై ప్రతీ సోమవారం మండల, జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ సభ్యుడు కిల్లారి త్రినాథరావు, పార్టీ నాయకులు తూలగాపు తిరుపతిరావు, ఎన్ని తిరుపతి, నాగరాజు, గూరాడి అప్పన్న, బోని గిరి, బోసి రామారావు, కనకాల కరెన్న, పల్లి గోవిందరావు, కీర్తి తిరుమలరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# దూసుకొచ్చిన మృత్యువు

- మ్యాక్సీక్యాబ్ ఢీకొని ల్యాబ్ టెక్నీషియన్ మృతి
- విషాదంలో కుటుంబ సభ్యులు



ఘటనా స్థలంలో మృతదేహం



ఎచ్చెర్ల క్యాంపస్: విధి నిర్వహణకు బయలుదేరిన ఓ ఉద్యోగిని మృత్యువు వెంటాడింది. ఇంటి నుంచి బయలుదేరిన నిమిషాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందాడనే విషయం తెలిసి అతని భార్య విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటన ఎచ్చెర్ల కేశవరెడ్డి పాఠశాల సమీపంలోని రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశరాజు వెంకట కిరణ్‌కుమార్ (40) అనే వ్యక్తి రణస్థలం సమీపంలోని కొండములగాం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఎచ్చెర్ల కేశవరెడ్డి పాఠశాల సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో కొన్నేళ్ల క్రితం ప్లాట్ కొనుక్కుని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇక్కడి నుంచే ఆస్పత్రికి స్కూటీపై రాకపోకలు సాగిస్తున్నాడు. ఎప్పట్లాగే ఆదివారం కూడా ఆస్పత్రి విధులకు హాజరయ్యేందుకు స్కూటర్‌పై బయలుదేరాడు. పాత జాతీయ రహదారిపై కేశవరెడ్డి ప్రైవేట్ పాఠశాల సమీపంలో సర్వీస్ రోడ్డు నుంచి రణస్థలం వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటుండగా రాజాం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న మ్యాక్సీ క్యాబ్ వాహనం ఢీకొట్టింది. దీంతో స్కూటీ కొన్ని మీటర్లు ముందుకెళ్లి ఎగిరిపడింది. ఈ ఘటనలో కిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దృశ్యాలన్నీ అక్కడి స్క్రాప్ షాపులోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. కిరణ్‌కుమార్ గతంలో ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేశారు. అనంతరం రణస్థలం బదిలీ అయ్యారు. ఇతనికి భార్య స్వప్న, ఇద్దరు కుమార్తెలు జ్యోతిశాశ్రీ, నిరీషాశ్రీ ఉన్నారు. స్వస్థలం శ్రీకాకుళమైనా ఇక్కడే సొంతంగా ప్లాట్ కొనుక్కొని పిల్లలను చదివిస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. సంతోషంగా సాగుతున్న కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకొని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 'ప్రసాద్' పథకం కోసం ప్రయత్నాలు



మంత్రి అచ్చెన్నాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం ఇంకా ఎలాంటి ఫాలోఅప్ చేయకపోవడంపై తనకు అసంతృప్తిగా ఉందని రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం కుటుంబసమేతంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించామని, ఇందుకోసం ఆలయం ముందర నిర్మాణాలన్నీ యుద్ధ ప్రాతిపదికన కూల్చివేసి.. అద్భుతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని భావించామని, తర్వాత ఫాలో అప్ సరిగ్గా లేకపోవడంతో పనులు ప్రారంభించలేకపోయామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' స్కీం మంజూరు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని.. ఆ నిధులు వచ్చేవరకు భక్తులకు తాత్కాలికంగా సౌకర్యాల కోసం ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మంత్రి సోదరుడు హరిప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జిలు తెలుగు నాగరత్నం, ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష పార్టీలు ఏకం కావాలి



మామిడి అప్పలసూరి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.నారాయణమూర్తి, ధర్మాన కృష్ణదాస్ తదితరులు

- అప్పలసూరి ఆశయం నెరవేర్చాలి
- జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభలో వక్తలు

నరసన్నపేట:

ప్రజల సమస్యలు పరిష్కారానికి, వారికి అండగా ఉండేందుకు వామపక్ష పార్టీల తలో మార్గంలో ఎర్ర జెండా నీడన ఉద్యమాలు చేస్తున్నారని, బూర్జువా పార్టీలు కలిసి పనిచేస్తున్న తీరులో వామపక్ష పార్టీలు కూడా ఏకం కావాల్సిన అవసరం ఉందని సినీ నటుడు, దర్శకుడు పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి, పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నరసన్నపేట మండలం కోమర్తిలో మామిడి అప్పలసూరి వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ అమరవీరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లాలో ఉన్న ప్రధాన వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. 1960 నుంచి అనేక ఉద్యమాల్లో పాల్గొన్న అప్పలసూరి ఆయన మరణించే వరకూ విప్లవ పార్టీలతో పాటు సీపీఐ, సీపీఎంలు కూడా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని భావించే వారని, ఈ మేరకు చివరి వరకూ తన వంతు ప్రయత్నాలు చేశారని అధ్యక్షోపాన్యాసం చేసిన ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు గుర్తు చేశారు. ఎర్ర జెండాలన్నీ ఒక గొడుగు కిందకు రావడమే అప్పలసూరికి మనమిచ్చే ఘన నివాళి అవుతుందని నారాయణమూర్తి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ అప్పలసూరి వ్యక్తిత్వం ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు దంతులూరి వర్మ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాశిరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విజయనగరం పౌరహక్కుల సంఘం కార్యదర్శి సీహెచ్ పకీరునాయుడు, ప్రజా కళాకారుల సమాఖ్య ప్రతినిధి రౌతు వాసుదేవరావు, రచయిత గంటేటి గౌరినాయుడు, న్యాయవాది మామిడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు. ప్రజాకళామండలి ఆధ్వర్యంలో కార్యకర్తలు గీతాలు ఆలపించారు.

# జిల్లా బేస్‌బాల్ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



సత్కారం అందుకున్న క్రీడాకారులతో బేస్‌బాల్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రవికుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీనియర్ అడ్వకేట్ మొదలవలస రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, రాష్ట్ర బేస్‌బాల్ సంఘ పరిశీలకులు సీహెచ్ రాజేష్ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతు జిల్లాలో బేస్‌బాల్ అసోసియేషన్‌ను ఏకతాటిపై ముందుకు తీసుకెళ్తామని.. గేమ్ అభివృద్ధికి, క్రీడాకారుల ఎదుగుదలకు పాటుపడతామన్నారు. అంతకుముందు జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ జిల్లా సీఈఓ పి.సుందరరావు, బి.విజయ్‌కుమార్, వై.పోలినాయుడు, సాధు శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, సీహెచ్ జగదీష్, నిర్మల్‌కృష్ణ, కె.మాధవరావు, సతీష్‌రాయుడు, పేడాడ బాబూరావు, ఈశ్వరరావు, వెంకటరమణ, పీడీలు, పీఈటీలు, మాజీ, తాజా సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గమిదే..**

జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కిల్లంశెట్టి అరుణ్‌కుమార్ గుప్తా, జిల్లా అధ్యక్షుడిగా గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి రాంబాబు, కోశాధికారిగా చీకటి మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కొండపల్లి రవికుమార్, సంఘ సహాధ్యక్షులుగా డి.రామాంజనేయులు, లకిలి రాంబాబు, నిమ్మాన విజయమ్మ, సంయుక్త కార్యదర్శులుగా తోటాడ శ్రీను, అంధవరపు సంతోష్‌కుమార్, ఇప్పిలి అరుణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.గురుమూర్తి, కె.రమేష్, ఐ.సాయికిరణ్, ఐ.గౌరీశంకర్, డి.రాజేష్, ఎం.మధు, కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# మారణకాండపై న్యాయ విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పలాస: మధ్య భారతదేశంలో ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండపై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే విచారణ జరపాలని, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని, అడవులు ఆదివాసీ గూడేల్లో ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని ప్రజాతంత్ర ఉద్యమ వేదిక (పి.డి.ఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పలాస మండలం మాకన్నపల్లిలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్యోద్యమ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పి.డి.ఎం. జిల్లా అధ్యక్షుడు జె.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వంటి వీరులు దోపిడీ రహిత సోషలిస్టు సమాజం నిర్మాణం కోసం కలలు గన్నారని, నేడు ఆ కలలు కల్లలయ్యావని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆశలు ఆశయాలు నేటికి ఇంకా మిగిలే ఉన్నాయని, వారి తోవలోనే దండకారణ్యంలో ఆదివాసీలు పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. అయితే పాలకవర్గాలు ఆ పోరాటాన్ని అణిచివేయాలని కగార్ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టడానికి పథకం రచించారని, వాటిని పౌర సమాజం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కె.ఎన్.పి.ఎస్.రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, డి.టి.ఎఫ్ జిల్లా నాయకుడు డి.ధర్మారావు, చింతాడ ధర్మారావు, ఎం.ధర్మారావు(పి.కె.ఎస్), జోగి కోదండం, మద్దిల వినోద్‌కుమార్(పి.డి.ఎస్.యు), తెప్పల అజయ్, కృష్ణమూర్తి, నాగమణి, వీరాస్వామి, లక్ష్మణ్, పి.దానేసు తదితరులు పాల్గొన్నారు.

## ఆగిన కార్చిచ్చు







మందస సమీప అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా రగులుతున్న కార్చిచ్చు ఎట్టకేలకు అదుపులోకి వచ్చింది. ఔషధ వనరులు, వన్య ప్రాణులు, అటవీ సంపదకు నెలవైన చీపి, మేఘమాల, బుడంబో, భావనపురం తదితర ప్రాంతాల్లో అగ్ని కీలలు ఎగసిపడటంతో అనేక చెట్లు కాలిపోయాయి. జీడితోటలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎండ తీవ్రతకు ఎండిపోయిన వెదురు చెట్లు రాపిడి కారణంగా మంటలు చెలరేగుతాయని, దీనిని గ్రౌండ్ ఫయర్‌గా పిలుస్తుంటామని, ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోకి వచ్చిందని సిబ్బంది పేర్కొన్నారు. -మందస